ప్రభుత్వ పాఠశాలకు స్థలం మంజూరు

కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు



నిజాంపేట్ : ఎట్టకేలకు బాచుపల్లి ప్రభుత్వ పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి, ప్లే గ్రౌండ్ కోసం జిల్లా కలెక్టర్ గౌతమ్ 20 గుంటలు స్థలాన్ని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు గదుల కోసం స్థలం లేక గదులు నిర్మించలేని పరిస్థితిలో ఉండడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, పలువురు నాయకులు జిల్లా కలెక్టర్‌ను, అడిషనల్ కలెక్టర్‌ను కలిసి పలుమార్లు ఫిర్యాదు చేశారు. సాక్షి సైతం ఈ సమస్యను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేసింది. దీంతో ఎట్టకేలకు స్పందించిన జిల్లా కలెక్టర్ ఎమ్మార్వో నివేదిక ఆధారంగా 20 గుంటల స్థలాన్ని కేటాయిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల గదులు నిర్మాణానికి సీఎస్ఆర్ నిధులు సైతం సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం స్థలం మంజూరు కావడంతో అదనపు తరగతుల నిర్మాణం వేగవంతంగా పూర్తి అయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గాడి తప్పుతున్న 'స్వచ్ఛ ఆటోలు'



జంట సర్కిళ్ల పరిధిలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఇంటింటికీ తిరిగి సేకరించే చెత్త ప్రక్రియ గాడి తప్పుతోంది. చెత్త రిక్షా ఆటోవాలలు తమకు కేటాయించిన ఇళ్ల నుంచే చెత్తను సేకరించాలి. కానీ కొందరు పక్కదారి పడుతుండటంతో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యాపారాలు కొనసాగించే హోటళ్లపై దృష్టి సారిస్తున్నారు. జీపీఎస్ ట్రాక్ ఉన్నప్పటికీ డోంట్ కేర్ అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో చెత్త రిక్షా ఆటోవాలాలు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. – కుత్బుల్లాపూర్

కేటాయించిన ఇళ్లకు కాకుండా హోటళ్లపై దృష్టి

- పేరుకుపోతున్న చెత్తతో దుర్గంధం
- ఫిర్యాదులు చేస్తేనే స్పందిస్తున్న అధికారులు
- కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో 138 వాహనాలకు 90 వాటికి జీపీఎస్ ట్రాక్

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఇంటింటికీ చెత్త సేకరణలో భాగంగా రెండు సర్కిళ్లలో 266 ఆటోలు ఉన్నాయి. ఒక్కో ఆటో విలువ సుమారు రూ.7 లక్షల వరకు ఉంటుంది. ఇందులో లబ్ధిదారుడికి వాటా రూ. 40 వేల నుంచి రూ.80 వేల వరకు, మిగిలిన మొత్తాన్ని ప్రతి నెల వాయిదా రూపంలో జీహెచ్ఎంసీ బ్యాంకులకు చెల్లిస్తుంది. ఇన్సూరెన్స్ మొత్తాన్ని కూడా గ్రేటర్ అధికారులే చెల్లిస్తున్నారు.

అదనపు వసూలు

రెండు జంట సర్కిల్లో పరిధిలో సేకరించిన చెత్తను హెచ్ఎంటీ ప్రదేశంలో ఉన్న రాంకీ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌కు తరలించాలి. కానీ అలా కాకుండా సేకరించిన చెత్తా చెదారాలను బయట ప్రాంతంలో డంపింగ్ చేస్తూ వెళ్లిపోతున్నారు. ప్రతి ఇంటి నుంచి క్రమం తప్పకుండా చెత్త సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాల్సి ఉండగా వాటిని పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రతి ఇంటి యజమాని నుంచి నెలకు రూ. 70 నుంచి 100 వసూలు చేయాలి. కానీ రూ.150 నుంచి రూ.500 వరకు వివిధ కేటగిరీల వారిగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.



హోటళ్లు, రెస్టారెంట్లపై దృష్టి

కొన్ని ప్రాంతాల్లో ఆటోడ్రైవర్లు తమకు కేటాయించిన ఇళ్లకు కాకుండా హోటళ్లు, రెస్టారెంట్ల పైన దృష్టి సారిస్తున్నారు. తమ ఇళ్లల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెలువడుతుందని ఆయా ప్రాంతాల ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకుండా ఇతర ప్రాంతాల్లో డంపు చేస్తున్న విషయాన్ని గుర్తించి ఐదు వాహనాలకు గాజులరామారం సర్కిల్ వైద్య ఆరోగ్య అధికారి మమత ఫైన్ విధించారు. అదేవిధంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో వైద్య అధికారి కవిత సైతం రెండు వాహనాలను గుర్తించి ఫైన్ వేశారు.

జీపీఎస్ ఉన్నా పట్టించుకోకుండా...

రెండు జంట సర్కిళ్ల పరిధిలో ఉన్న చెత్త రిక్షా ఆటోలకు జీపీఎస్ ట్రాక్ ఉన్నప్పటికీ గ్రేటర్ అధికారులు వీటిపై దృష్టి సారించడం లేదన్న విమర్శ ఉంది. రోజు విడిచి రోజు రావలసిన ఆటోలు ఆయా కాలనీకి రాకుండా డుమ్మా కొడుతున్న విషయంపై ఫిర్యాదులు వచ్చినప్పుడే అధికారులు స్పందిస్తున్నట్లు సమాచారం. స్వచ్ఛ ఆటోలు ఎక్కడ తిరుగుతున్నాయి... ప్రస్తుతం ఏ ప్రాంతంలో ఉన్నాయి ..అన్న విషయాన్ని కేంద్ర కార్యాలయ సిబ్బంది సైతం గుర్తించకపోవడం విశేషం. గ్రేటర్ కమిషనర్ ఒకవైపు హెచ్చరికలు జారీ చేస్తున్నా జీపీఎస్‌ను సైతం ట్యాంపరింగ్ చేస్తూ చెత్త రిక్షా ఆటోలు పక్కదారి పడుతున్నాయి. గతంలో జీపీఎస్ డివైజ్‌ను ధ్వంసం చేసిన విషయాన్ని గుర్తించిన అధికారులు పలువురికి జరిమానా విధించి చేతులు దులుపుకున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో 138 వాహనాలు ఉండగా వాటిలో 90 వాహనాలకు మాత్రమే జీపీఎస్ ట్రాక్ నడుస్తుంది. మిగిలిన వాటి పరిస్థితిపై అధికారుల్లో జవాబు లేకుండా పోతుంది. గాజులరామారం సర్కిల్ పరిధిలో మొత్తం 128 వాహనాలు ఉండగా వాటిలో 10 వాహనాలకు మరమ్మతులు జరుగుతున్నాయని, మిగిలిన వాహనాలకు జీపీఎస్ ట్రాక్ ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

స్వచ్ఛ ఆటోలపై నిరంతర నిఘా



ప్రతిరోజూ వస్తున్న ఫిర్యాదుల ఆధారంగా ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తున్నాము. కొన్ని ప్రాంతాల్లో చెత్త సేకరించే ఆటోలు రావడం లేదని సమాచారం అందిన వెంటనే ఆటో వాళ్లను కార్యాలయానికి పిలిచి హెచ్చరిస్తున్నాం. డంపింగ్ కేంద్రంలో చెత్తను వేయాల్సి ఉండగా బయట ప్రాంతంలో వేస్తున్న విషయాన్ని గుర్తించి జరిమానా కూడా విధించాం. ప్రతిరోజు వీరిపై సంబంధిత శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ తో పాటు జవాన్లు దృష్టి పెడుతున్నారు. చెత్తను సేకరించే వారు దురుసుగా వ్యవహరిస్తే తమకు ఫిర్యాదు చేయాలి.

– మమత, గాజులరామారం సర్కిల్, వైద్య ఆరోగ్య అధికారి

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు

దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, సంఘం సభ్యులు శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. వివిధ సమస్యల గురించి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా ఈ నెల 6వ తేదీన పలు ప్రాంతాల్లో జరగబోయే శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొనాలని పలువురు ఆహ్వాన పత్రికలను అందజేశారు.

ఎర్లీ బర్డ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



గాజులరామారం ఉప కమిషనర్

కుత్బుల్లాపూర్ : ఎర్లీ బర్డ్ ద్వారా ప్రజలు పన్నులు చెల్లించి ఐదు శాతం రాయితీ పొందాలని గాజులరామారం ఉప కమిషనర్ మల్లారెడ్డి అన్నారు. సర్కిల్ 26లో ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేసి నెలరోజుల పాటు ఎర్లీ బర్డ్ ద్వారా పన్నులు వసూలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. మొత్తం సర్కిల్ పరిధిలో 53, 500 గృహ వాణిజ్య వ్యాపార సంస్థలు ఉన్నాయని, వాటికి రూ.35.04 కోట్లు 2024–25 మార్చి 31 వరకు వసూలు చేయాల్సి ఉండగా ప్రజల సహకారంతో రూ.39.56 కోట్లు వసూలు చేయడం సంతోషంగా ఉందన్నారు. అదనంగా గతంలో ఉన్న బకాయిలతో పాటు తాజా పన్నులు చెల్లించినట్లు తెలిపారు. అదేవిధంగా ఏప్రిల్ నెలాఖరు వరకు ఎర్లీ బర్డ్ ద్వారా ఐదు శాతం రాయితీ పొంది పన్నులు చెల్లించేందుకు ముందుకు రావాలన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



రంగారెడ్డినగర్: సంజయ్‌గాంధీనగర్ రేషన్ దుకాణం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్‌గాంధీ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బండారి నారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు యూసూఫ్, నర్సింహులు, మల్లయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

నిజాంపేట్ : కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జైభీమ్, జైబాపు, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పలు డివిజన్‌లలో కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంత్‌రెడ్డి, కో ఆర్డినేటర్ ఉజ్మా షాకీర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బీవీఆర్ఐటీలో ఘనంగా సినర్జియా 2025 వేడుకలు

నిజాంపేట్ : బాచుపల్లిలోని బీవీఆర్ఐటీ కళాశాలలో బుధవారం సినర్జియా 2025 వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు 500 మంది విద్యార్థులు వివిధ సాంకేతికత, సాంస్కృతిక పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.వి.ఎన్.సునిత మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు నిర్వస్తున్నామని తెలిపారు. నూతన సాంకేతికతకు సంబంధించిన అనేక పోటీలు జరుగుతున్నాయని వివరించారు. అనంతరం సినర్జియా కన్వీనర్ డా.మాలతి మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సాంకేతిక పోటీ భావాన్ని పెంపొందించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.

కాంగ్రెస్ పాలనలో పేదలకు మేలు



సన్న బియ్యం పంపిణీలో కూన రాఘువేంద్ర గౌడ్

కుత్బుల్లాపూర్ : కాంగ్రెస్ పాలనలో పేద ప్రజలకు మేలు జరుగుతుందని యువజన కాంగ్రెస్ నాయకుడు కూన రాఘువేంద్ర గౌడ్ అన్నారు. సూరారం డివిజన్ పరిధిలోని షాపూర్ నగర్‌లోని రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సన్న బియ్యం పేదలకు పంచిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీల్లో భాగంగా సన్న బియ్యం కార్యక్రమం కూడా ఒకటి అని, రాబోయే రోజుల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరుతున్నప్పటికీ ప్రతిపక్ష నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను కాంగ్రెస్ కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

పైపులైన్ పనులను పూర్తి చేయాలి

వాటర్ వర్క్స్ ట్రాన్స్‌మిషన్ జీఎం రాజశేఖర్



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న జలమండలి ట్రాన్స్‌మిషన్ జీఎం రాజశేఖర్, డీజీఎం రవికుమార్

చింతల్: పైపులైన్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని వాటర్ వర్క్స్ ట్రాన్స్‌మిషన్ జీఎం రాజశేఖర్ అన్నారు. షాపూర్‌నగర్ నుంచి జీడిమెట్ల అల్వాల్‌కు వెళ్లే 800 ఎంఎం డయా గల పైప్‌లైన్ శిథిలావస్థకు చేరి తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయి. దీంతో జలమండలి అధికారులు పాత పైపులైన్ స్థానంలో నూతనంగా 1000 ఎం.ఎం డయా పైప్ లైన్‌ను షాపూర్ నగర్ రింగ్ మాస్ చాంబర్ నుంచి జీడిమెట్ల పైప్‌లైన్ రోడ్డు కాంటా వరకు ఈ లైన్‌ను విస్తరిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం డీజీఎం రవికుమార్‌తో కలిసి పనులను పరిశీలించారు. అదే విధంగా షాపూర్ నగర్‌లోని తిరుమల బేకరీ ఎదురుగా ఉన్న చాంబర్‌పై అక్రమ ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ సెంటర్ల ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ నెల 25వ తేదీలోగా చాంబర్‌పై ఏర్పాటు చేసిన వ్యాపార సముదాయాన్ని తొలగించకపోతే తమ సిబ్బంది తొలగిస్తారని నిర్వాహకులకు హెచ్చరించారు.

13న ధర్నాచౌక్‌లో మున్నూరు కాపు రణభేరి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్: మున్నూరు కాపు ఆత్మగౌరవ మహా ధర్నా సేన ఆధ్వర్యంలో ఈ నెల 13న ఇందిర పార్కు ధర్నా చౌక్‌లో రణభేరి సభను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కన్వీనర్ ఉగ్గే శ్రీనివాస్‌పటేల్ అన్నారు. బుధవారం షాపూర్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో రణభేరి సభ పోస్టర్‌ను మేడ్చల్ జిల్లా యూత్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్నూరు కాపులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారన్నారు. తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు బూర్గు లక్ష్మీనారాయణ, రాష్ట్ర కో కన్వీనర్లు బత్తుల రాములు, పుప్పాల ప్రభాకర్, ముకుంద రావు, తాటి రవి కుమార్, కృష్ణంగారి ప్రకాష్, అమరం శ్యామ్‌కుమార్, రామిని సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత లేని డాక్టర్లతో వైద్యం..

• భవిష్య వెల్ విషర్ ఆసుపత్రికి రూ.5 లక్షల జరిమానా • డీఎంహెచ్ఓ డాక్టర్ ఉమాగౌరీ వెల్లడి



జరిమానా విధిస్తున్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని చెంగిచర్ల భవిష్య వెల్ విషర్ ప్రైవేట్ ఆసుపత్రిలో అర్హత లేని డాక్టర్లు రోగులకు వైద్య సేవలు అందించటాన్ని తీవ్రంగా పరిగణిస్తూ ఈమేరకు చర్యలు తీసుకున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఉమాగౌరీ తెలిపారు. ఆసుపత్రిలో అర్హత కలిగిన మెడికల్ డైరెక్టర్ లేకపోవడంతోపాటు అర్హత లేని సిబ్బందిని నియమించారన్నారు. అధిక శక్తి కలిగిన మాత్రలను రోగులకు వినియోగించటంతోపాటు అనధికార వైద్య చికిత్సలను చేయటాన్ని ఆసుపత్రిలో గుర్తించినట్లు ఆమె పేర్కొన్నారు. లైసెన్స్ పొందిన పారా మెడికల్ సిబ్బంది కూడా ఆసుపత్రిలో లేరన్నారు. బుధవారం ఆకస్మికంగా చెంగిచర్ల భవిష్య వెల్ విస్సర్ ప్రైవేట్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనఖీ చేయగా .. విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. ప్రభుత్వ నిబంధలు ఉల్లఘించిన భవిష్య వెల్ విస్సర్ ఆసుపత్రి యాజమాన్యానికి రూ. 5 లక్షల జరిమానా విధించటంతోపాటు ఆసుపత్రి రిజిస్ట్రేషన్‌ను 60 రోజులు తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. యాజమాన్యంపై ఈ మేరకు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసేందుకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆసుపత్రిలో వైద్య పరికరాలు జప్తు చేసినట్లు తెలిపారు. డీఎంహెచ్ఓ డాక్టరు సి. ఉమాగౌరీతో సహా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ గీతా, అసిస్టెంట్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టరు వినోద్, రెవెన్యూశాఖ , పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

జీడిమెట్ల: మనస్తాపంతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ వివరాల ప్రకారం.. షాపూర్‌నగర్ సంజయ్‌గాంధీ నగర్‌కు చెందిన ఎండీ ఇమ్రాన్ పాషా(27) పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. ఇమ్రాన్‌కు గత సంవత్సరం క్రితం ఎంగేజ్‌మెంట్ కూడా జరిగింది. కొన్ని రోజులుగా ఇమ్రాన్ తరచూ తన కుటుంబ సభ్యులతో నేను చినపోతాను అని అంటుండేవాడు. గతంలో ఇమ్రాన్ నిద్రమాత్రలు సైతం వేసుకున్నాడు. కాగా మంగళ వారం రాత్రి ఇమ్రాన్ భోజనం చేసి గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. ఉదయం అతను గది నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన ఇమ్రాన్ సోదరి అతని గదిలోకి వెళ్లి చూడగా.. సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

నిజాంపేట్ : బాచుపల్లి, కౌసల్య కాలనీలోని శ్రీ వెంకట శివ రామాలయం ప్రథమ వార్షికోత్సవ మహోత్సవంతో పాటు శ్రీరామ నవమి వేడుకలు నేటి నుంచి ఈ నెల 6వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీ వెంకట శివ రామాలయ అనువంశిక ధర్మకర్త ఆగం రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 8:30 గంటల నుంచి మంగళ వాయిద్యం, స్వస్తి వచనం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహావాచనం, మాతృక పూజ, పంచగవ్య ప్రాశనము మొదలగు కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం 4:30 గంటల నుంచి మాతృక, యోగిని, వాస్తు, క్షేత్ర, పాలక బ్రహ్మాది మండల దేవతా స్థాపనములు తీర్థ ప్రసాదం జరుగును. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంటకేశ్వరస్వామి వారికి, హనుమత్ సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్ర మూర్తికి విశేష అభిషేకాలు నిర్వహిస్తారు. శనివారం ఉదయం 8 గంటలకు స్థాపిత దేవతా పూజలు, కల్యాణ హోమములు తదితర కార్యక్రమాలు, ఆదివారం శ్రీరామనవమి మహాపర్వదినమున ఉదయం 10:30 గంటల నుంచి సీతారామ కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం 12:30 గంటలకు అన్నప్రసాదం నిర్వహిస్తారు.

నేడు జేఎన్‌టీయూహెచ్ గోల్డెన్‌జూబ్లీ బిల్డింగ్ ప్రారంభం

వీసీ టి. కిషన్‌కుమార్ రెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం, హైదరాబాద్‌లో నూతనంగా నిర్మించిన గోల్డెన్‌జూబ్లీ బిల్డింగ్‌ను వీసీ ప్రొఫెసర్ టి. కిషన్‌కుమార్ రెడ్డి గురువారం ఉదయం ప్రారంభించనున్నారు. ఈ మేరకు రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

హెచ్‌సీయూ భూములను కాపాడాలని సీపీఎం నిరసన



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

కుత్బుల్లాపూర్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూముల రక్షణ కోసం పోరాడుతున్న విద్యార్థులను, నాయకుల అక్రమ అరెస్టులకు సీపీఎం నేతలు ఖండించారు. బుధవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ రైతు బజార్ నుంచి సాగర్ హోటల్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైందని, విచ్చలవిడిగా భూములను ఆక్రమించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి విద్యాసంస్థల భూములను కూడా వదలడం లేదన్నారు. హెచ్‌సీయూ భూములను సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు వేలం వేసి అమ్మే ఆలోచనలో ఉందన్నారు. ప్రభుత్వ తీరు మార్చుకోకుంటే గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు దైవదానం, పసుల అంజయ్య, కరుణాకర్, రావుల స్వాతి, పార్టీ నాయకులు మల్లారెడ్డి, పాషా, ఆంజనేయులు, దుర్గా నాయక్, కే, శీను మధు తదితరులు పాల్గొన్నారు

రోడ్లపై చెత్త వేయకుండా కట్టడి చేయాలి



సమావేశంలో పాల్గొన్న శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు

కుత్బుల్లాపూర్ : రోడ్లపై చెత్త వేయకుండా కట్టడి చేయాలని, సంక్షేమ సంఘాలతో మమేకమై తడి, పొడి చెత్త వేరు చేసి చెత్త రిక్షాలో వేసే విధంగా చర్యలు తీసుకోవాలని కుత్బుల్లాపూర్ వైద్య ఆరోగ్య అధికారి కవిత అన్నారు. సర్కిల్ కార్యాలయంలో బుధవారం శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ట్రేడ్ లైసెన్స్, బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం, కార్మికులతో పని విధానంపై మాట్లాడారు. ఇప్పటికే ట్రేడ్ లైసెన్స్ విషయంపై పలువురికి నోటీసులు జారీ చేశామని, కొత్త ట్రేడ్ లైసెన్స్‌తో పాటు పాతవి రెన్యువల్ చేయాలన్నారు. పలు కాలనీలో చెత్త వేసే విషయంపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

హెచ్‌సీయూ భూముల పరిరక్షణకు పోరాటాలు



మృత్యుంజయను అదుపులోకి తీసుకుంటున్న బాలానగర్ పోలీసులు

రంగారెడ్డినగర్: హెచ్‌సీయూ భూముల పరిరక్షణకు మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మృత్యుంజయ అన్నారు. హెచ్‌సీయూ భూములను పరిరక్షించాలని కోరుతూ బుధవారం ఐడీపీఎల్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవ వైవిధ్యానికి ప్రతీకైనా సెంట్రల్ యూనివర్సిటీలోని 400 ఎకరాల అటవీ ప్రాంతాన్ని కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడం సరి కాదన్నారు. ఎంత మంది పోలీస్ బలగాలను దింపినా హెచ్‌సీయూ భూముల పరిరక్షణకు తమ పోరాటం ఆగదన్నారు. నిరసనతో బాలానగర్– నర్సాపూర్ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న బాలానగర్ సీఐ నరసింహరాజు తన సిబ్బందితో అక్కడకు చేరుకుని ఏబీవీపీ నాయకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కన్వీనర్ నగేష్, భాగ్యనగర్ సంయుక్త కార్యదర్శి వివేక్, కొంపల్లి నగర సంయుక్త కార్యదర్శి శ్రీకాంత్, మహేష్, మనోజ్, దేవేందర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



దానమ్మ(ఫైల్)

సుభాష్‌నగర్: మతిస్థిమితం సరిగా లేని ఓ వృద్ధురాలు అదృశ్యమైంది. ఈ ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సూరారం స్కందానగర్‌కు చెందిన దానమ్మ(65) కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువుల ఇళ్లల్లో వాకబు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో వృద్ధురాలి కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా దానమ్మకు మతిస్థిమితం సరిగా లేదని, తెలుగు మాత్రమే మాట్లాడగలదని ఫిర్యాదులో పేర్కొన్నారు.